'సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ' స్పెషల్ డ్రైవ్ ప్రారంభం

- ఇంకుడు గుంతల నిర్మాణ పోస్టర్‌ను ఆవిష్కరించిన సిఎం
- కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- పనులపై జిపిఎస్ ట్రాకింగ్ ద్వారా పర్యవేక్షణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఎం తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మహా నగరంలో సీవరేజ్ ఓవర్ ఫ్లో నివారణ, ఇంకుడు గుంతల నిర్మాణంపై జలమండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్ బుధవారం ప్రారంభమైంది. మెహదీపట్నంలోని బాపూఘాట్ వద్ద గాంధీకి నివాళులు అర్పించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పెషల్ డ్రైవ్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించి లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు సరోజినిదేవి ఆస్పత్రి ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణం కార్యక్రమాన్ని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ప్రతి వర్షపు చుక్కనూ భూగర్భ జలంగా మార్చాలన్నారు. వర్షపు నీటిని వృథా చేయకుండా.. వినియోగించుకోవాలన్నారు. ప్రజలు తమ ప్రాంగణాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలన్నారు. భవిష్యత్‌లో నీటి కరువు రాకుండా ఖాళీ ప్రదేశాల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు. నగరంలో ఉన్న మ్యాన్ హోళ్లలో వ్యర్థాలు వేయొద్దని, మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించొద్దని సూచించారు. హైదరాబాద్ నగరాన్ని సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ'గా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలన్నారు. ప్రతి పౌరుడూ దీన్నొక బాధ్యతగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రతినిధులు, పార్టీలకతీతంగా నాయకులు ఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని కోరారు.

జలమండలి ఎండి అశోకరెడ్డి మాట్లాడుతూ.. హైదారాబాద్‌ను సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీగా మార్చాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశామని తెలిపారు. దీర్ఘకాలికంగా ఉన్న సీవరేజ్ సమస్యల పరిష్కారం, ఇంకుడు గుంతల నిర్మాణంపై దృష్టి పెట్టినట్టు చెప్పారు. వాటర్ ట్యాంకర్ డిమాండ్ తగ్గించడానికి వినియోగదారులు తమ ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ స్పెషల్ డ్రైవ్ ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపి అనిల్ కుమార్ యాదవ్, నాంపల్లి ఎమ్మెల్యే మజీద్ హుస్సేన్, జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జలమండలి ఇడి మాయంక్ మిట్టల్, డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం.. జలమండలి ఓఅండ్ఎం అన్ని కార్యాలయాల్లో స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభించారు.

గాంధీ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్

మహాత్ముడికి ఘన నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్ లంగర్‌హౌజ్‌లోని బాపూఘాట్‌లో గల గాంధీ విగ్రహానికి, బాపు సమాధి వద్ద బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుష్పగుచ్ఛాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, మేయర్ జి విజయలక్ష్మి, మాజీ ఎంపి హనుమంతరావు, ఇతర ప్రజాప్రతినిధులు గాంధీకి ఘన నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, అహింసా వాదిగా యావత్ భారతాన్ని ప్రభావితం చేసిన ఆయన వ్యక్తిత్వం, ఉద్యమ కార్యాచరణ మనందరికి స్ఫూర్తిదాయమని వారు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అంతకుముందు గాంధీ మ్యూజియంలో సర్వమత ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డిజిపి డాక్టర్ జితేందర్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఉన్నతాధికారులు, జిహెచ్ఎంసి, వివిధ శాఖల అధికారులు, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొని గాంధీజీకి నివాళులర్పించారు. బాపు ఘాట్ వద్ద గాంధీకి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నివాళులర్పించారు.

మూసీ నిర్వాసితులకు 'డబుల్' ఇళ్లు, రూ. 25 వేల పారితోషికం

- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూసీ నిర్వాసితులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కారు తీపి కబురు అందించింది. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లతోపాటు రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటన విడుదల చేశారు. స్వచ్ఛందంగా మరో ప్రాంతానికి తరలివెళ్లే మూసీ పరివాహక ప్రాంతంలోని ప్రతి కుటుంబానికీ డబుల్ బెడ్ రూమ్ ఇంటితో పాటు రూ.25 వేల పారితోషికం ప్రభుత్వం చెల్లిస్తుందని పేర్కొన్నారు.

ఆకాయ్ నుంచి నూతన శ్రేణి టివిలు

హైదరాబాద్ : వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా అకాయ్ ఇండియా ఈ పండుగ సీజన్‌లో పెద్ద పరిమాణంలో 190 సెంటీమీటర్లు, 254 సెంటీమీటర్ల టివిలను ఆవిష్కరించినట్లు తెలిపింది. వీటి ధరలను వరుసగా రూ.99,900, రూ.3,99,999గా నిర్ణయించింది. ఆండ్రాయిడ్ 11తో నడుస్తున్న ఈ సిరీస్‌లో అధునాతన 4కె క్యుఎల్ఇడి డిస్ప్లే టెక్నాలజీ, డాల్బీ విజన్, డాల్బీ అట్మాస్ సౌండ్ ఫీచర్లు ఉన్నాయని పేర్కొంది. వీటిపై రెండేళ్ల వారంటీ ఉంటుందని తెలిపింది.

ఎస్ఎల్‌టిఎ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం (ఎస్ఎల్‌టిఎటిఎస్) 22వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చక్రవర్తుల శ్రీనివాస్ ఎస్ఎల్‌టిఎ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషాపండితుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు 2003 అక్టోబర్ 2న ఎస్ఎల్‌టిఎ ఆవిర్భవించిందని చెప్పారు. ఈ ఏడాది జూన్ 19న భాషాపండితులకు ఉద్యోగోన్నతులు లభించాయని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగోన్నతులు పొందకుండా మిగిలిన తెలుగు, హిందీ పండితులకు ఉద్యోగోన్నతులను కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. భాషా సేవకు అంకితమై ప్రభుత్వానికి మంచిపేరు తెస్తామని అన్నారు.

పుష్ప2తో ఐటిసి మంగళదీప్ భాగస్వామ్యం

హైదరాబాద్ : ప్రముఖ అగరుబత్తిల బ్రాండ్ ఐటిసి మంగళదీప్ త్వరలో విడుదల కానున్న పుష్ప2 ది రూల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా మంగళ్‌దీప్ సెంట్ 3 ఇన్ 1 అగర్బత్తి ప్యాక్‌ను విడుదల చేశామని ఆ కంపెనీ ప్రతినిధి గౌరవ్ తాయల్ తెలిపారు. అల్లూ అర్జున్ ముఖ చిత్రంతో రానున్న వీటిని తొలుత దక్షిణాదిలో అందుబాటులోకి తేనున్నామన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యే లక్ష్యం

- బర్లింగ్టన్ ఇంగ్లిష్ ఇండియా ఎండి వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం లక్ష్యమని బర్లింగ్టన్ ఇంగ్లిష్ ఇండియా, సౌత్‌ఈస్ట్ ఆసియా మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ బవేజా తెలిపారు. ఇందుకోసం జాతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా విద్యా నాణ్యతను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అధ్యాపకులకు శిక్షణ ఇచ్చే లక్ష్యంతో హైదరాబాద్‌లోని నాంపల్లిలో 'బర్లింగ్టన్ ఇంగ్లిష్ 100 ఇడి ఫెస్ట్ 2024' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్ష మందికి చేరువ కావాలన్నదే ధ్యేయమన్నారు. దక్షిణాసియాలో వంద నగరాలను కవర్ చేయనున్నామని తెలిపారు. ఇది 21వ నగరమని అన్నారు. అత్యాధునిక తరగతి గదులు, అభ్యాస అనుభవాలు మార్చడం, వినూత్న బోధనా పద్ధతులు అన్వేషించడం దీని ఉద్దేశమన్నారు.

సామాజిక, ఆర్థిక, సమానత్వ సాధనే కెవిపిఎస్ లక్ష్యం

- రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ
- ఘనంగా సంఘం 26వ వార్షికోత్సవ వేడుకలు

జెండా ఎగురువేస్తున్న జాన్ వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తరతరాలుగా కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, అసమానతలను అంతం చేయడానికి సమానత్వసాధనే లక్ష్యంగా కెవిపిఎస్ ఏర్పడిందని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ అన్నారు. బుధవారం కెవిపిఎస్ 25వ వార్షికోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మండలం రాగన్నగూడలోని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా కార్యాలయం వద్ద సంఘం జెండాను జాన్‌వెస్లీ ఎగరవేశారు. అనంతరం నగర కార్యదర్శి మస్కు ప్రకాష్ కారత్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. అంటరానితనం, కులవివక్షకు వ్యతిరేకంగా ఒక చారిత్రాకవసరంగా1998లో కెవిపిఎస్ ఏర్పడిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కుల వివక్ష, అంటరానితనంపై వందలాది గ్రామాల్లో వేలాది మంది కార్యకర్తలచే సర్వేలు, అధ్యయనాలు నిర్వహించి సుమారు 128 రకాల కుల వివక్ష రూపాలను వెలికి తీసినట్టు తెలిపారు. వందల సంఘాలను ఐక్యం చేసి.. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటు కోసం దశలవారీ పోరాటాలు నిర్వహించామని, జస్టిస్ పుల్లయ్య కమిషన్ సాధించిన ఘన చరిత్ర కెవిపిఎస్‌కు ఉందన్నారు. 2004 నుంచి 2013 వరకు సుమారు పదేళ్లు.. పోరాడి ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టం సాధించామని గుర్తుచేశారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా రాజీలేని ఉద్యమాలు నిర్వహించి బాధితులకు బాసటగా సంఘం నిలబడిందన్నారు. దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలుచేసేలా పోరాడుతున్నట్టు చెప్పారు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు రక్షణ కల్పించాలని, కులదురహంకార హత్యలను అరికట్టాలని ఉద్యమాలు నిర్వహించినట్టు తెలిపారు. చర్మకారుల, డప్పు కళాకారుల సమస్యల సాధన కోసం ఉద్యమించిందన్నారు. స్వాతంత్రం వచ్చి 77 ఏళ్లు దాటుతున్నా నేటికీ గ్రామాలు, పట్టణాల్లో కుల వివక్ష విలయతాండమవుతున్నదని, వీటిని అరికట్టాల్సిన పోలీసులు, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్ల ఇంకా దళితులపై దాడులు కొనసాగుతున్నాయని విమర్శించారు. పదేళ్ల మోడీ పాలనలో దళితులు, గిరిజనులు, మహిళలపై 300 రెట్లు దాడులు పెరిగాయని తెలిపారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన మోడీ ప్రభుత్వం మనుధర్మ శాస్త్రాన్ని తూచా తప్పకుండా అమలు చేస్తూ భారత సెక్యులర్ విలువలను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. విద్వేషాలను రెచ్చగొట్టడం ద్వారా దేశ ప్రజల మధ్య ఐక్యతను చెదరగొట్టడమే కాకుండా అభద్రతను సృష్టిస్తుందన్నారు. మతసామరస్యం కోసం, కుల వివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా సామాజిక, సమానత్వం కోసం కెవిపిఎస్ మరింత ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు కాడిగాళ్ల భాస్కర్, జిల్లా అధ్యక్షులు బోడా సామేల్, సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్ర మోహన్, జిల్లా ఉపాధ్యక్షులు జగదీష్, కవిత, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ పగడల యాదయ్య, శోభన్, సిఐటియు జిల్లా నాయకులు కిషన్, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ భవన్‌ను ముట్టడించిన 317 జిఓ బాధితులు

- ఉత్తర్వులు రద్దు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నాంపల్లిలోని గాంధీభవన్‌ను 317 జిఓ బాధితులు ముట్టడించారు. జిఓకు వ్యతిరేకంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. రోడ్డుపై వారు బైటాయించడంతో ట్రాఫిక్ జాం ఏర్పడింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి వారిని అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ సందర్భంగా బాధితులు పలువురు మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో జిఓ 317 బాధితుల సమస్యను పరిష్కరిస్తానని సిఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి పది నెలలు అయినా తమ సమస్యను పరిష్కరించలేదని, దీనిపై కమిటీ వేసి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే 317 జిఓపై ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దసరాలోగా కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించి జిఓ 317 బాధితులను స్థానిక జిల్లాలకు పంపేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానికులకు అన్యాయం జరిగిందని, దీని సరిచేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

అమరుల చరిత్రను చెబుదాం

- ప్రొఫెసర్ కోదండరాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమరుల చరిత్రను సమాజానికి చెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ జన సమితి (టిజెఎస్) రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. బుధవారం టీజేఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద పెత్తరమాస సందర్భంగా అమరవీరులకు బియ్యం ఇచ్చే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులను స్మరిస్తూ గత కొన్ని సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రసాధన కోసం 650 మంది బలిదానాలు చేసుకునీ, మరో 650 మంది ఆవేదనతో మరణించి తమ ప్రాణాలను ఉద్యమానికి అర్పించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో టిజెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బైరి రమేష్, పల్లె వినయ్, రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్, సర్దార్ వినోద్, గ్రేటర్ హైదరాబాద్ నాయకులు బట్టల రాంచందర్, జైపాల్ రెడ్డి, ఇస్మాయిల్, సురేష్, రసూల్, లక్ష్మణ్, శేఖర్, నాయక్ మరియు ఉద్యమకారులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌బిఐ ఉద్యోగుల స్వచ్ఛతా సేవా

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) హైదరాబాద్ సర్కిల్ తమ లోకల్ హెడ్ ఆఫీసు పరిసరాల్లో శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టింది. బుధవారం గాంధీ జయంతి, స్వచ్ఛ భారత్ దివాస్ సందర్భంగా ఆ బ్యాంక్ ఉద్యోగులు స్వచ్ఛతా హీ సేవా 2024 క్యాంపెయిన్‌ను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆ బ్యాంక్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్, ఉన్నతాధికారులు ప్రకాశ్ చంద్ర బరోర్, రవి కుమార్ వర్మ, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

డెంగీ జ్వరంతో యువతి మృతి

హైదరాబాద్ బ్యూరో : ఓ యువతి డెంగీతో మృతిచెందిన ఘటన బుధవారం వరంగల్ జిల్లాలో జరిగింది. చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సంగెం దేవేందర్- రమ దంపతుల కూతురు కళ్యాణి (20) వారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజిఎం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హన్మకొండలోని ఓ ప్రయివేటుపైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షల్లో డెంగీ జ్వరంగా నిర్ధారణ కావడంతోపాటు రక్త కణాలు తగ్గడంతో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలు కల్యాణి హైదరాబాద్‌లో పిజి మొదటి సంవత్సరం చదువుతోంది. మృతురాలి కుటుంబాన్ని గ్రామ ఉద్యోగ, వ్యాపారవేత్తల సమూహ ప్రతినిధి పులి దేవేందర్ ముదిరాజ్, గ్రామ పెద్దలు పెరుమాండ్ల లక్ష్మారెడ్డి, వట్టే రాంరెడ్డి, పరికి మధుకర్, బాషమియ, ఉమారెడ్డి, మెరుగు కుమార్, స్వామి, తదితరులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బాలికతో ట్యూషన్ మాస్టర్ అసభ్య ప్రవర్తన

హైదరాబాద్ బ్యూరో : పాఠశాల అనంతరం ట్యూషన్ కోసం వెళ్తున్న ఓ బాలిక పట్ల టీచర్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ ఘటన హైదరాబాద్ ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకెళ్తే.. ఫిల్మ్ నగర్‌లో పదో తరగతి చదువుతున్న ఓ బాలిక స్థానికంగా ఉండే ట్యూషన్ మాస్టర్ రాములు వద్దకు క్లాసులకు వెళ్తున్నారు. ఈ క్రమంలో బాలికతో రాములు అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లికి చెప్పడంతో ఆమె ఫిల్మ్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.

హైడ్రా వెనుక రాహుల్ గాంధీ

- మూసీ బ్యూటిఫికేషన్ కాదు.. లూటిఫికేషన్...
- రూ.16 వేల కోట్ల ప్రాజెక్టును రూ.1.5 లక్షల కోట్లకు పెంపు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో హైడ్రా బుల్డోజర్ల కూల్చివేతల వెనుక ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఉన్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధిష్టానంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. "రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది మూసీ బ్యూటిఫికేషన్ కాదు, లూటిఫికేషన్. రూ.16 వేల కోట్ల ప్రాజెక్టును రూ.1.5 లక్షల కోట్లకు పెంచారు. ఇప్పటి వరకు డిపిఆరే పూర్తి కాలేదు. సర్వే చేపట్టలేదు. పునరావాసంపై విధానపరమైన నిర్ణయం తీసుకోలేదు. రాత్రికి రాత్రి మూసీ పరివాహక ప్రాంత పేదలను బలవంతంగా తరలిస్తున్నారు" అని విమర్శించారు. బిజెపి బుల్డోజర్ రాజ్ నడిపిస్తున్నదని ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో విమర్శిస్తున్న రాహుల్‌గాంధీ, ఆ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో హైడ్రా విధ్వంసంపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "కేవలం డబ్బు కోసమే మూసీ ప్రక్షాళన చేపట్టారు. కాంగ్రెస్‌కు నోట్ల కట్టలు కావాలి కానీ.. బాధితుల కష్టాలు పట్టవు. దేశంలో అతిపెద్ద నమామి గంగే ప్రాజెక్టు ప్రక్షాళనకు కిలో మీటర్‌కు రూ.17 కోట్లు వ్యయం అవుతుంటే, మూసీకి కిలో మీటర్‌కు రూ.2,700 కోట్లు ఖర్చు చేస్తామంటున్నారు. ఇది స్కామ్ కాక మరేమవుతుంది" అని కెటిఆర్ ప్రశ్నించారు. మూసి ప్రాజెక్ట్ సుందరీకరణ చేయాలని తమ హయాంలోనే నిర్ణయించినప్పటికీ, పేదల ఇళ్లు కూల్చి చేయాలనుకోలేదని పేర్కొన్నారు. గతంలో ప్రాజెక్ట్‌పై తీసుకున్న నిర్ణయాలు చేసిన పనులపై రెండు, మూడు రోజుల్లో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తానని వెల్లడించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి దమ్ముంటే మూసీ ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను ఒప్పించాలని డిమాండ్ చేశారు. మూసీ బాధితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం మూడు రెట్ల నష్ట పరిహారం, రూ.5 లక్షల రవాణా ఛార్జీలు, ఇంటికో ఉద్యోగం కల్పించిన తర్వాతే పేదలను తరలించాలని ప్రభుత్వానికి సూచించారు.

రాష్ట్రంలో పాలన గాడి తప్పింది

రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని కేటీఆర్ విమర్శించారు. "పూర్తి రుణ మాఫీ జరిగిందని సీఎం అంటున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి మాత్రం మరో 20 లక్షల మందికి రుణమాఫీ పూర్తి చేయాల్సి ఉందంటారు. సీఎం ఫార్మాసిటీ రద్దంటారు. రద్దు కాలేదంటూ చీఫ్ సెక్రటరీ కోర్టును మభ్య పెట్టే ప్రయత్నం చేస్తారు. రాష్ట్రంలో మంత్రులు, అధికారులు, సీఎంకు మధ్యన సమన్వయం లేదు. నిన్నటితో వర్షాకాలం పూర్తి అయినప్పటికీ, ఇప్పటి వరకు రైతుబంధు ఊసేలేదు. కొండా సురేఖ దొంగ ఏడుపులు, పెడబొబ్బలు దేనికి? మా పార్టీ తరపున ఆమెపై ఎవరు మాట్లాడలేదు. సోషల్ మీడియాలో మాపైన ట్రోలింగ్ పేరుతో దాడి జరగడం లేదా? గతంలో మాట్లాడిన బూతు మాటలు ఆమె గుర్తు తెచ్చుకోవాలి" అని కేటీఆర్ విమర్శించారు.

బతుకమ్మకు పూల కరువు

- నవరాత్రి ఉత్సవాల్లో భారీ డిమాండ్

హైదరాబాద్ బ్యూరో : బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలకు కావాల్సిన పూలు, పండ్లు అన్నీ వ్యవసాయ పొలాల్లోనే లభించేవి. కాల క్రమేణా ప్రకృతిలో స్వతహాగా లభించే తంగేడు, సోపు, గడ్డి చామంతి, జిల్లేడు పువ్వు, గునుగు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు ఎక్కువగా చామంతి, బంతి పూలతోనే పండుగలు చేసుకోవాల్సి వస్తోంది. అయితే, వాటి సాగు కూడా నానాటికీ తగ్గడం.. ప్రభుత్వాల సహకారం లేకపోవడం..వినియోగం పెరగడంతో బతుకమ్మకు పూల కరువు ఏర్పడుతోంది. ఓ వైపు నిత్యావసర సరుకుల ధరలు.. మరోవైపు పూల ధరలూ పెరిగాయి. బంతి పూలు కిలో రూ.100 నుంచి 120 రూపాయలకు పైగా పలుకుతోంది. చామంతి రూ.80 నుంచి 100 రూపాయలు, రోజా పువ్వులు రూ.100 నుంచి 120 అయింది. తంగేడు, గునుగు, కట్ల పువ్వులకు గిరాకీ పెరిగింది.

ఊరూరా బతుకమ్మ పూజలు ప్రతి ఇంట్లో తోరణాలు పూజాలంకరణ ఇలా అనేక రకమైన పూలతో సేవలు చేస్తుంటారు. గుమ్మడి, గునుగు, చామంతి, తంగేడు పూలతో బతుకమ్మను అలంకరించి ఊరి నడిబొడ్డున లేదా.. చివరన ఒక చోట పెట్టి మహిళలు ఆటపాటలతో వైభవంగా జరుపుకుంటారు. కానీ సామాన్యుల ఆనందాన్ని పూల కొరత పట్టిపీడిస్తోంది. పూలకు ప్రత్యేక పేరుగాంచిన బంతి, చామంతి, తంగేడు, గుమ్మడి ఒంటి పూలు క్రమంగా కనుమరుగు అవుతున్నాయి. రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు ధరలను మరింత పెంచుతూ సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నారు. గతంలో వ్యవసాయ పొలంలోనే బంతిపూలు, గుమ్మడి, తంగేడు, చామంతి పూలు ఉచితంగా లభించేవి. ఇప్పుడు వ్యవసాయంలో చిన్న కమతాలు పోయి భారీ కమతాలు వచ్చాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగిపోయింది. పట్టణీకరణ పెరిగిపోవడంతో పూలు సాగయ్యే పరిస్థితులు లేవు. అందుకే పండుగకు సామాన్యులు పూలను కొనాలంటే బెంబేలెత్తిపోతున్నారు. గత నెల తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాల కారణంగా పూలతో పాటు ఆహార పంటలు భారీగా నష్టపోయాయి. దీంతో దిగుబడి తగ్గింది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండల పరిధిలో రైతు చంద్రయ్య తనకున్న 30 గుంటల భూమిలో బంతి పూలు సాగు చేశాడు. దిగుబడి ఆశించిన స్థాయిలో లేదు. దీంతో ఆ రైతు పెట్టుబడులు రాక అప్పుల్లో కూరుకుపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందుకే రైతులు పూలసాగు పట్ల ముందుకు రావడం లేదు. నాగర్‌కర్నూలు జిల్లాలో 16 ఎకరాలు, నారాయణపేట జిల్లాలో 8 ఎకరాలు, మహబూబ్‌నగర్ జిల్లాలో 11 ఎకరాలు, గద్వాల జిల్లాలో 5 ఎకరాలు, వనపర్తి జిల్లాలో 7 ఎకరాల చొప్పున వివిధ రకాల పూల పంటలను సాగు చేశారు. దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి రావాల్సిన పూలు లేకపోవడంతో అధిక రేట్లతో పూలు కొనుగోలు చేసి మహిళలు బతుకమ్మను ఆడుతున్నారు.

పెట్టుబడి వచ్చేటట్టు లేదు..
చంద్రయ్య, రైతు బిజినపల్లి

అర ఎకరం పొలంలో బంతి పూల తోట సాగు చేశాను. ఒక చెట్టు 50 రూపాయలు పెట్టి ఖరీదు చేశాను. దిగుబడి పూర్తిగా తగ్గింది. నాసిరకం విత్తనానికి తోడు అధిక వర్షాలు పంటను నాశనం చేశాయి. ఆహార వాణిజ్య పంటలతో పాటు పూల తోటలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి.

ఆర్‌టిసిలో అన్నీ ఎలక్ట్రిక్ బస్సులే

- జపాన్ కంపెనీలకు డిప్యూటీ సిఎం భట్టి ఆహ్వానం

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి)లో ఇకపై అన్నీ ఎలక్ట్రిక్ బస్సులే ఉంటాయని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రాన్ని ఎలక్ట్రానిక్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందనీ, ఫ్యూచర్ సిటీలో గ్రీన్ ఎలక్ట్రికల్ వెహికల్స్‌కే తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ దశలో జపాన్‌కు చెందిన తోషిబా సంస్థ సేవలు అవసరమవుతాయన్నారు. సింగరేణి వ్యాపార విస్తరణలో భాగంగా బొగ్గుతో పాటు లిథియం వంటి ఇతర ఖనిజాల తవ్వకాలు చేపడుతుందన్నారు. లిథియం బ్యాటరీల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న తోషిబా సంస్థ సింగరేణితో కలిసి ముందుకు సాగితే మార్పు త్వరగా సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. జపాన్ దేశంలో మూడు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం డిప్యూటీ సిఎం నేతృత్వంలోని బృందం తోషిబా ప్రధాన కార్యాలయం, పరిశ్రమలు, ఫ్యూయల్ సెల్ విభాగాలను సందర్శించింది. తోషిబా ఎనర్జీ సిస్టమ్స్ అండ్ సొల్యూషన్స్ ఉన్నతాధికారి హిరోషి కనేట, వైస్ ప్రెసిడెంట్ షిగే రిజో కవహర, కనేట తదితరులు డిప్యూటీ సీఎం బృందానికి స్వాగతం పలికారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తోషిబా ఉత్పత్తుల సేవలను వివరించారు. సోలార్ విద్యుత్‌లో వినియోగించే ఫోటో వోల్టాయిక్ మాడ్యూల్స్ తయారీ, ఫ్యూయల్‌సెల్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ టెక్నాలజీ, శక్తివంతమైన జనరేటర్లు, జీరో కార్బన్ ఎమిషన్ టెక్నాలజీల గురించి వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు కోసం ఉన్న అవకాశాలను డిప్యూటీ సిఎం అక్కడి అధికారులకు వివరించారు. ఫ్యూచర్ సిటీలో ఫ్యూయల్ సెల్ టెక్నాలజీ వినియోగం ఎక్కువగా ఉంటుందనీ, సంబంధిత యూనిట్లను ఉమ్మడి భాగస్వామ్యంతో ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని కోరారు. అనంతరం తోషిబా ఫ్యూయల్ సెల్ తయారీ యూనిట్‌ను సందర్శించారు. న్యూక్లియర్ పవర్, థర్మల్ పవర్ ఉత్పత్తిలో వినియోగించే టర్బయిన్లు, జనరేటర్ల తయారీ యూనిట్లను పరిశీలించారు. ఫోటో వోల్టాయిక్ మాడ్యూల్స్, ఇతర బ్యాటరీల తయారీ విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తోషిబా సేవల్ని విస్తరిస్తామన్నారు. అనంతరం అక్కడి నుంచి బుల్లెట్ ట్రైన్‌లో 700 కిలోమీటర్లు ప్రయాణించి, పానసోనిక్ ఎలక్ట్రానిక్ కంపెనీ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బుల్లెట్ ట్రైన్‌పై ప్రసంసలు కురిపించారు. 700 కి.మీ., దూరాన్ని కేవలం 2 గంటల 20 నిమిషాల్లో చేరుకున్నామని తెలిపారు. రైలులో సౌకర్యాలు కూడా ఆధునికంగా ఉన్నాయని చెప్పారు. డిప్యూటీ సీఎం వెంట రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సిఎండీ ఎన్ బలరాం, భారత రాయబార కార్యాలయ అధికారులు బన్సల్, దేవజాని తదితరులు ఉన్నారు.

మూసీ నిర్వాసితులకు అండగా ఉంటాం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, డిజి, అబ్బాస్
- బడా కార్పొరేట్లకు కట్టబెట్టే యత్నం
- కుమార్ కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- మూసీ పరివాహక ప్రాంతంలో సిపిఎం నేతల పర్యటన

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలకు సిపిఎం అండగా ఉంటుందని, మూసీ సుందరీకరణ పేరుతో పేదలను నగరం బయటికి పంపి బడా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతున్నదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, డిజి నర్సింహారావు, అబ్బాస్ అన్నారు. దాన్ని అడ్డుకోవడానికి.. పేదల కోసం.. మూసీ నిర్వాసితులకు సిపిఎం అన్ని విధాలుగా అండగా ఉంటుందని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని కాచిగూడ, కృష్ణానగర్, గోల్నాక లంక మూసీ పరివాహక ప్రాంతంలో పర్యటించి బాధితులతో మాట్లాడారు. అలాగే సిపిఎం హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో సైదాబాద్ మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. పలు ముసారాంబాగ్, శాలివాహన నగర్, ఓల్డ్ మలక్‌పేట, శంకర్‌నగర్ తదితర బస్తీలలో పాదయాత్ర నిర్వహించారు.

సిపిఎం నేతలకు తమ సమస్యలను చెబుతున్న మూసి నిర్వాసితులు

ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి, డిజి నర్సింహారావు, అబ్బాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బడా కార్పొరేట్ సంస్థలకు భూమిని అప్పజెప్పి షాపింగ్ మాల్స్, గార్డెన్లు, స్కై వేలు, స్టార్ హోటల్స్ కట్టి అభివృద్ధి అంటోందని తెలిపారు. మూసీ సుందరీకరణను స్వాగతిస్తున్నామని, అదే సందర్భంలో పరివాహక ప్రాంతంలో నివాసముంటున్న పేదల ఇళ్లను తొలగించి.. వారి బతుకులను రోడ్డుపాలు చేస్తామంటే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేదల సమస్యలను పరిష్కరించకుండా ఖాళీ చేయిస్తామంటే ఊరుకోబోమన్నారు. ఒక ఇంట్లో ఎన్ని కుటుంబాలు ఉంటే.. అందరికీ న్యాయం చేయాలన్నారు. వారికి ఇప్పుడున్న జీవితం కంటే మెరుగైన జీవితాన్ని అందించాలని, లేదంటే వారి ఇళ్లను తొలగించకుండా మూసీ లోపల అభివృద్ధి చేయాలని సూచించారు. లేని పక్షంలో తమ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతుందని, జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. మూసీ సుందరీకరణ పేరుతో పేదలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, దాంతో ఇప్పటికే కూకట్‌పల్లిలో సుబ్బలక్ష్మి అనే మహిళ ఆత్మహత్య చేసుకున్నట్టు చెప్పారు. ఇప్పుడు గోల్నాక లంక ప్రాంతంలో భవన నిర్మాణ కార్మికుడు కుమార్ ఆందోళనతో గుండెపోటుకు గురై ప్రాణం కోల్పోయాడని అన్నారు. దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని, బాధిత కుటుంబానికి నష్టపరిహారంగా రూ.20 లక్షలు ఇవ్వాలని, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రజలతో మాట్లాడి బస్తీ మీటింగ్ ఏర్పాటు చేసి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, వారందరూ ఒప్పుకుంటేనే ఇక్కడి నుంచి తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం మహేందర్, అంబర్‌పేట జోన్ కమిటీ సభ్యులు జి రాములు, బి సుబ్బారావు, ఎల్ సోమయ్య, షబానా, వరలక్ష్మి, అఖిల్, లలిత తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయండి

- నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

రక్తదానం చేసి ప్రాణాలు నిలిపేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప పిలుపునిచ్చారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా నిమ్స్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆ సంస్థ ట్రైనింగ్ డైరెక్టర్ డాక్టర్ మాధవితో కలిసి డాక్టర్ బీరప్ప ప్రారంభించారు. ఈ శిబిరంలో శిక్షణలో ఉన్న ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎఎస్, ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ, స్టాటిస్టిక్స్ డిపార్మెంట్‌లో సెలెక్ట్ అయిన ట్రెయిన్ ఆఫీసర్స్ దాదాపు వందమంది రక్తదానం చేశారు. ఈ కారక్రమంలో సౌజన్య రాణి, నిమ్స్ బ్లడ్ బ్యాంక్ నుంచి డాక్టర్ గాయత్రీ, బిడుగు శేఖర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం పట్ల గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

రెండేళ్ల కిందట ప్రారంభించిన రోడ్డు పనులు ఇప్పటికీ పూర్తిచేయకపోగా, ఇసుక లారీలు నిలుపుదల చేస్తేనే రోడ్డు మరమ్మతులు చేపడతానంటూ కాంట్రాక్టర్ బుకాయించడంతో గ్రామస్తులు రాస్తోరోకో చేశారు. ఈ సంఘటన ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వెంటకటాపురం మండల కేంద్రం నుంచి నిత్యం వందల సంఖ్యలో ఇసుక లారీల రాకపోకలు ఈ రోడ్డు గుండా వస్తూ ఉంటాయి. దాంతో రోడ్డు మొత్తం గుంతలు పడి దుమ్ముతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం వెంకటాపురం మండల కేంద్రంలో రోడ్డుపై దుమ్ము కారణంగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు వేపచెట్టు సెంటర్ వద్ద ఢీ కొన్నాయి. దాంతో రోడ్డు మరమ్మతులు ఎప్పుడు పూర్తి

గుంతలు పడ్డా రోడ్డు

చేస్తారంటూ ఆర్అండ్‌బీ అధికారులు, రోడ్డు కాంట్రాక్టర్‌ను వెంకటాపురం గ్రామస్తులు నిలదీశారు. ఇసుక లారీలు నిలుపుదల చేస్తేనే రోడ్డు మరమ్మతులు చేపడుతామని కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో వేపచెట్టు సెంటర్ వద్ద భద్రాచలం–వెంకటాపురం ప్రధాన రహదారిపై గ్రామస్తులు బైటాయించి.. రెండు గంటలకు పైగా ఆందోళన చేపట్టారు. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అధికారులు.. రోడ్డు కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీనివ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. కాగా, గతంలో ఇసుక లారీల వల్ల వచ్చే దుమ్ము తగ్గించడం కోసం మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ఇసుక కాంట్రాక్టర్లు ట్యాంకర్లను ఏర్పాటు చేసి రోడ్లపై నీటితో తడిపేవారు. ఈ ఏడాది ఇసుక కాంట్రాక్టర్లు ప్రధాన రహదారిపై నీటిని తడపకుండానే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దాంతో ప్రధాన రహదారిపై దుమ్ము చేరి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ములుగు జిల్లా కలెక్టర్ స్పందించి ఇసుక కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి మండల కేంద్రంలోనైనా ప్రధాన రహదారిపై ట్యాంకర్లతో నీరు పట్టించి దుమ్ము సమస్య తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

'మూసీ సుందరీకరణ'పై ఏకాభిప్రాయ సాధనకు కృషి చేయాలి

- పార్టీలు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు, మేధావులతో చర్చించాలి
- బాధిత ప్రజల్లో భయాందోళనలు తొలగించాలి
- సిఎం రేవంత్‌రెడ్డికి తమ్మినేని లేఖ

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

మూసీ సుందరీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు పేద, మధ్య తరగతి ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. మూసీ రివర్‌బెడ్ ప్రాంతంలో ఇళ్లు కట్టుకుని నివాసముంటున్న ప్రజలపై 'మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' పోలీసులు, అధికారులను ప్రయోగిస్తున్నదనీ, ఇళ్ల కూల్చివేతలకు ఏర్పాట్లు చేస్తున్నదని పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బుధవారం ఆయన లేఖ రాశారు. ప్రభుత్వ తీరుతో పేద, మధ్యతరగతి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని వివరించారు. ఎప్పుడు బుల్డోజర్లు వచ్చి ఇళ్లు కూలగొడతాయోనని ప్రజలు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం ఇంత హడావుడిగా నిర్ణయాలు తీసుకుని ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్రజల భద్రతకు ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. పర్యాటక కేంద్రంగా మార్చినంత మాత్రాన ఈ ప్రయోజనాలు నెరవేరవని వివరించారు. పైగా పెద్దఎత్తున సాధారణ ప్రజల ఆవాసాలకు ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మూసీలో ప్రధాన సమస్య కాలుష్యమని తెలిపారు. మందులు, రసాయనాల పరిశ్రమలకు సంబంధించిన వ్యర్థాలు, జంట నగరాల మురుగునీరు మూసీలో కలవడం వల్ల కాలుష్యం పెరుగుతున్నదని పేర్కొన్నారు. మూసీ పరిసరాల ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. ఉప్పల్, ఘట్‌కేసర్ ప్రాంతం నుంచి మొదలై, సూర్యాపేట జిల్లా దాటేవరకు కలుషిత మూసీ జలాలను వ్యవసాయం, పచ్చగడ్డి, చేపల పెంపకం, ఎడ్లు, బర్రెలకే కాకుండా, ప్రజల తాగునీటికి కూడా వాడుతున్నారని వివరించారు. దీని వల్ల ఇక్కడ వ్యవసాయ ఉత్పత్తులు పాలు, చేపలు ఉపయోగించిన ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. దీనికి తోడు మూసీలోనూ, మూసీ గట్ల మీద నివాసాలు ఏర్పరచుకున్న పేదల ఇండ్లు వరదల్లో ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. మూసీకి సంబంధించిన ఈ అసలైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడం కీలకమని సూచించారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన అంశంలో విస్తృత సంప్రదింపులు లేకుండా ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు చేయడం సరైంది కాదని తెలిపారు. రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు తదితరులతో విస్తృతంగా సంప్రదింపులు జరిపి ఏకాభిప్రాయ సాధనకు కృషి చేయాలని కోరారు.

పిడుగుపాటుకు ఇద్దరు మహిళా కూలీల మృతి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ఉరుములు మెరుపులతో కురిసిన ఆకస్మిక వర్షంతో పిడుగులు పడి ఇద్దరు మహిళా కార్మికులు మృతి చెందిన సంఘటన హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండలం చౌళ్లపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌళ్లపల్లికి చెందిన ఇటికాల నిర్మల (51), సోలంకి రమ (48).. గ్రామంలోని ఓ రైతు వ్యవసాయ భూమిలో పత్తి ఏరేందుకు కూలీ పనికి వెళ్లారు. పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో సాయంత్రం ఈదురు గాలులతో వర్షం రావడంతో సమీపంలోని కల్లు మండవ వద్ద ఉన్న చెట్టు కిందకు వెళ్లారు. అదే సమయంలో చెట్టుకింద ఉన్న మహిళలపై పిడుగుపడటంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. నిర్మలకు ముగ్గురు కుమార్తెలు, రమకు ఇద్దరు కుమారులు ఉన్నారు. నిరుపేదలైన వీరి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న ఆత్మకూరు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్టాఫ్ నర్స్ కోర్సులు పూర్తయిన కాంట్రాక్ట్ ఎన్ఎంలకు వెయిటేజీ

- టియుఎంహెచ్ఇయు డిమాండ్

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

స్టాఫ్ నర్స్ కోర్సులు పూర్తి చేసిన కాంట్రాక్ట్ ఎఎన్ఎంలకు సెప్టెంబర్ 18న విడుదల చేసిన నోటిఫికేషన్‌లో వెయిటేజీ ఇవ్వాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టియుఎంహెచ్ఇయు) డిమాండ్ చేసింది. బుధవారం హైదరాబాద్‌లోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, నగర అధ్యక్షులు జె కుమారస్వామి, రాష్ట్ర కార్యదర్శి బి కిరణ్మయి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఎఎన్ఎంలు డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ (డిఎస్‌సి) ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించి నియమితులై గత 17 ఏళ్లుగా కాంట్రాక్టు ప్రాతిపదికన విధులు నిర్వహిస్తూ రెగ్యులరైజేషన్ కోసం ఎదురు చూస్తున్నారని వారు తెలిపారు. వీరిలో చాలా మందికి జిఎన్ఎం అర్హత ఉందని స్పష్టం చేశారు. జిఎన్ఎం కోర్సు పూర్తి చేసి కాంట్రాక్ట్ ఎఎన్ఎంలుగా పని చేస్తున్నారని తెలిపారు. గతేడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్ ఎఎన్ఎంలు రెగ్యులరైజేషన్ కోసం సమ్మె చేస్తే గత ప్రభుత్వం త్రీమెన్ కమిటీ వేసి చేతులు దులుపుకుందని గుర్తుచేశారు. ఆ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా కాంట్రాక్ట్ ఎఎన్ఎంల రెగ్యులరైజేషన్ కోసం కృషి చేయాలని కోరారు. నోటిఫికేషన్‌లో ఎఎన్ఎంలకు వెయిటేజీ ఇచ్చి రెగ్యులర్ అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

బాధితులతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

పేదల ఇళ్లు కూల్చే అధికారం ఏ ప్రభుత్వానికీ లేదు

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

పేదల ఇళ్లు కూల్చే అధికారం ఏ ప్రభుత్వానికీ లేదని, పదేండ్ల బిఆర్ఎస్ పాలనకు కాంగ్రెస్ పాలనకు తేడా ఏమీ లేదని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ అంబర్‌పేటలోని మూసీ పరివాహక ప్రాంతాల్లో బాధితులను ఆయన పరామర్శించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. అది ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన భూమి కాదనీ.. వారు తమ కష్టార్జితంతో ఒక్కో ఇటుక పేర్చుకుని కట్టుకున్న ఇళ్లని చెప్పారు. గతంలో మాజీ సిఎం కెసిఆర్... మూసీ సుందరీకరణ పేరుతో కార్పొరేషన్ ఏర్పాటు చేసి, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్‌ను చైర్మన్‌గా పెట్టి ఇదే తరహాలో ఇళ్లపై మార్కింగ్ చేశారని గుర్తు చేశారు. బిఆర్ఎస్ పాలనలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లుఇస్తామంటూ మభ్యపెట్టారని, ఇక్కరికీ ఇల్లు ఇచ్చింది లేదని అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ సుందరీకరణకు రూ.లక్షా 50 వేల కోట్లు ఖర్చు పెడుతామంటోందని.. నిజంగా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అందులో రూ.50 వేల కోట్లతో ఇళ్లు లేని పేదలకు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆయుష్‌లో ఫార్మసిస్టులు లేక వెలవెల

- కాంట్రాక్టు ఉద్యోగులకు అన్యాయం
- డిప్లొమో కోర్సును ప్రవేశపెట్టాలని కోరుతున్న సిబ్బంది

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

వైద్యారోగ్యశాఖలోని ఆయుష్ విభాగంలో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. ఈ విభాగంలో 580 ఫార్మసిస్టు పోస్టులు మంజూరు కాగా ప్రస్తుతం 250 మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు. 2022 నాటికే 308 ఆయుష్ ఫార్మసిస్ట్ (పాత పేరు కంపౌండర్) ఖాళీలు భర్తీ చేయాల్సి ఉన్నది. గత మూడు సంవత్సరాల్లో 60 నుంచి 70 మంది వరకు పదవీ విరమణ చేశారు. చివరిసారిగా ఈ విభాగంలో 1998లో రెగ్యులర్ ఫార్మసిస్టుల నియామకాన్ని చేపట్టారు. గత 27 సంవత్సరాలుగా రెగ్యులర్ ఉద్యోగాల భర్తీ ఊసే లేకుండా పోయింది. 2008లో దశలవారీగా నేషనల్ హెల్త్ మిషన్ కింద ఫిక్స్‌డ్ రెమ్యునరేషన్ ప్రాతిపదికన 268 మంది నియమితులయ్యారు. కంపౌండర్ గా పేరున్న ఈ పోస్టులో ఇంటర్‌లో ఏదేనీ సైన్స్ గ్రూపు చేసిన అర్హత కలిగిన వారిని రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ జిల్లా ఎంపిక కమిటీ ద్వారా నియమించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 2017లో పాత జీవోను సవరించి కొత్త జీవోను ఇస్తూ అందులో ఆ పోస్టులో కొనసాగేందుకు డిప్లొమో ఇన్ ఫార్మసీ (ఆయుర్వేద, హెూమియో, యునానీ)ని అర్హతగా నిర్ణయించింది. దీంతో అప్పటికే ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్న వారి ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించిన అర్హత తెచ్చుకునేందుకు రాష్ట్రంలో అలాంటి కోర్సే లేకపోవడంతో అభ్యర్థులు ఆ కోర్సును ప్రవేశపెట్టాలని కోరారు. అయితే గత ప్రభుత్వం ఆ కోర్సును ప్రవేశపెట్టలేదు. ఆ తర్వాత 2024 వరకు కూడా అలాంటి కోర్సు రాష్ట్రంలో లేకపోవడంతో ఈ పోస్టులకు అభ్యర్థులు కరువయ్యారు. దీంతో ప్రభుత్వమే ఇన్ సర్వీస్ కోర్సుగా ప్రవేశపెట్టి ఇప్పటికే కాంట్రాక్టు ప్రాతిపదికన చేస్తున్న వారికి శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వానికి విన్నవించారు. వారి విజ్ఞప్తిని గత ప్రభుత్వం బేఖాతరు చేయగా, ప్రస్తుత వైద్యారోగ్యశాఖ మంత్రి పరిగణనలోకి తీసుకుని ఆ దిశగా సమీక్ష నిర్వహించి ఇతర రాష్ట్రాల్లో కోర్సుపై అధ్యయనం చేసేందుకు ఒక కమిటీని నియమించారు. ఆ కమిటీ అధ్యయనం చేసి సిలబస్ తదితర వాటిపై నివేదిక సమర్పించింది. దీంతో కాంట్రాక్టు కంపౌండర్ ఉద్యోగుల్లో ఆశలు చిగురించాయి. తమ ఉద్యోగాలు తమకే ఉంటాయని భరోసా కలిగింది. అయితే సెప్టెంబర్ మాసంలో ఆయుష్ కమిషనర్ ఫార్మసిస్టు పోస్టులను డిప్లొమో ఇన్ ఫార్మసీ అర్హత కలిగిన వారితో నింపాలన్న ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించినట్టు సమాచారం. ఒక వైపు ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోగా, అభ్యర్థులు కోరుతున్నట్టు కోర్సు ప్రవేశపెట్టక, శాఖాపరమైన శిక్షణకు ఏర్పాట్లు లేక, అర్హత నుంచి వన్ టైం మినహాయింపు జీవో జారీ చేయకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. మంత్రిని తప్పుదోవ పట్టించే విధంగా కొంత మంది డిప్లొమో ఇన్ ఫార్మసీ అర్హతను ముందుకు తీసుకువచ్చారనే అనుమానం వ్యక్తమవుతున్నది. ఇప్పటికే డిప్లొమో ఇన్ ఫార్మసీ చదివిన వారికి రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో 763 పోస్టులకు నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఆయుష్ ఫార్మసీ పోస్టులను కూడా వారికే ఇస్తే తమ పరిస్థితి ఏంటని ఆయుష్‌లో అనుభవజ్ఞులైన కాంట్రాక్ట్ సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. దేశంలో దాదాపు సగం రాష్ట్రాల్లో డిప్లొమో ఇన్ ఫార్మసీ (ఆయుర్వేద, హెూమియోపతి, యునానీ) కోర్సు ఉందనీ, రాష్ట్రంలో ఆ కోర్సును ప్రవేశపెట్టాలని సూచిస్తున్నారు. తద్వారా సంబంధిత వైద్యం తెలిసిన వారే ఫార్మసిస్టులుగా ఉద్యోగాలు పొందుతారనీ, పేద రోగులకు కూడా సరైన అర్హత కలిగిన ద్వారా ఆయుష్ ఔషధాల పంపిణీ జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో ఆయుష్‌కు సంబంధించి ఐదు మెడికల్ కాలేజీలు, 11 ఆస్పత్రులు, ఆయుర్వేద, యునానీ, హెూమియోపతి స్టోర్స్, 440 ఆయుష్ రెగ్యులర్ డిస్పెన్సరీలున్నాయి. ఇప్పటికే 421 డిస్పెన్సరీలను ఆయుష్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లుగా మార్చారు. నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా డిస్పెన్సరీల్లో ఔషధ మొక్కల పెంపకం, ల్యాబ్ టెస్టులు, మెడికల్, వృద్ధాప్య శిబిరాలతో ప్రజలకు సేవలందుతున్నాయి. ఇలాంటి విభాగంలో ఖాళీలు దీర్ఘకాలంగా ఉంచడం, తీరా ఖాళీల భర్తీ సమయంలో ఆయుష్ కాకుండా ఇతర అర్హతలు కలిగిన వారిని ఈ విభాగంలో తీసుకురావడం సరికాదని ఆయుష్ నిపుణులు సూచిస్తున్నారు. ఖాళీలను భర్తీ చేయాలని, జిఒ నెంబర్ 147ను సవరించి రెగ్యులర్ ఫార్మసిస్ట్ లేదా కంపౌండర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలనీ, రెండేళ్ల ఆయుష్ డిప్లొమా కోర్సును ప్రవేశపెట్టాలనీ, 2024–24 జాబ్ క్యాలెండర్‌లోని ఆయుష్ ఫార్మసిస్ట్ పోస్టులకు ఎన్ఆర్ హెచ్ఎం కాంట్రాక్టు ఆయుష్ ఫార్మసిస్టులను అర్హులుగా ప్రకటించాలని కోరుతున్నారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అలేఖ్య పుంజల, వాణి ప్రసాద్, మామిడి హరికృష్ణ

రవీంద్రభారతిలో బతుకమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి – కల్చరల్

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు బుధవారం రాత్రి అంగరంగ వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. రవీంద్రభారతి వేదికగా మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలను తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజల, తెలంగాణ రాష్ట్ర పర్యాటక, శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, డైరెక్టర్ మామిడి హరికృష్ణ ప్రారంభించారు. అనంతరం బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర పండుగైన బతుకమ్మ వేడుకలను ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా వైభవంగా నిర్వహిస్తోందని, సకల జనులు, సబ్బండ వర్ణాలు కలిసి ఏకత్వస్ఫూర్తిని చాటుకునేలా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి వేడుకలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తుందని అన్నారు. కాగా చివరి రోజైన ఈ నెల 10న ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో బతుకమ్మ బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

సదస్సులో మాట్లాడుతున్న ఆప్ ఎంపి సంజయ్ సింగ్

లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఏకమై బిజెపిని తరమాలి

- ఆప్ ఎంపి సంజయ్ సింగ్

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

దేశాన్ని అతలాకుతలం చేస్తున్న అతిపెద్ద దుష్ట శక్తి బిజెపిని లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఏకమై తరమాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎంపి సంజయ్ సింగ్ పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షతన వలంటీర్ల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ సింగ్ మాట్లాడుతూ బిజెపి పాలిత మణిపూర్‌లో హింసపై మౌనం వీడడం లేదని విమర్శించారు. పేదల సొమ్మును కార్పొరేట్లకు దోచి పెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలపై ఇడి.సిబిఐ, ఐటీలతో దాడులు చేయించి జైళ్లలో వేస్తున్నారని తెలిపారు. మద్యం పాలసీ కేసులో ఎలాంటి సాక్ష్యాధారాలు లేకున్నా..ఆప్ అధినేత కేజ్రీవాల్‌ను జైలుకు పంపించారని విమర్శించారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ, రాష్ట్ర ప్రభుత్వాలను కూలుస్తూ బిజెపి రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో ఆప్ బలోపేతానికి కషి చేయాలని ఆప్ శ్రేణులకు సూచించారు. ఈ సదస్సులో ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, అడ్వొకేట్ డాక్టర్ సోలొమన్ రాజ్, ఎంఎ మజీద్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుమార్తెకు ఆర్థిక సహాయం చేస్తున్న సిపిఎం నేతలు

అనారోగ్యంతో చేనేత కార్మికుడు మృతి

- ఆర్థిక సాయం చేసిన సిపిఎం

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం శభాష్ గూడెం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన చేనేత కార్మికుడు సీత కిష్టయ్య.. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఎం గ్రామ శాఖ...మృతుని కుటుంబానికి రూ.ఐదు వేలు ఆర్థిక సహాయం చేశారు. నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని సిపిఎం మండల కమిటీ సభ్యులు నాగపురి కనకయ్య, గ్రామ శాఖ కార్యదర్శి దండ్ల రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు.

గుర్తు తెలియని యువతి మృతి

- లైంగికదాడి.. ఆపై హత్య చేసినట్టు అనుమానాలు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

అనుమానాస్పద స్థితిలో యువతి మృతిచెందిన ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుజూసింది. యువతిపై లైంగికదాడి ఆపై.. హత్య జరిగినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ ముత్తు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి లోధా అపార్ట్‌మెంట్స్ సమీపంలోని కెపిహెచ్‌బి 5వ ఫేజ్ తెలంగాణ దశాబ్ది పార్కు ముందు పొదల్లో మృతదేహం ఉందని 100 డయల్ కాల్ ద్వారా పోలీసులకు సమాచారం అందింది. వెంటనే కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ ముత్తు అక్కడకు చేరుకుని పరిశీలించారు. యువతి వయస్సు సుమారు 25 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉంటుందని, బ్లాక్ కలర్ ప్యాంట్, బ్రౌన్ కలర్ లోదుస్తులు, క్రీమ్, బ్లాక్ కలర్ డ్రెస్ ధరించి ఉంది. ఆమె చాతికి ఎడమ వైపు లక్కీ అనే పేరుతో టాటూ, ఎడమ చేతిలో ఒక టాటూ ఉన్నాయి. ఆమె గొంతు పిసికిన గుర్తులు, దారం లేదా వైర్‌ల గుర్తులు ఉన్నాయి. శరీరంపైనా, ప్రయివేటు పార్ట్స్ వద్ద గాయాలున్నాయి. ఆమె బట్టలు చిరిగాయి. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంకు సమాచారం అందించి వివరాలు సేకరించారు. యువతిపై లైంగికదాడి చేసి.. ఆ తర్వాత హత్య చేసి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరించాలి

- ప్రభుత్వానికి టిసిపిఎస్ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉద్యోగులకు భద్రత లేని సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లింగమొల్ల దర్శణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఉప్పెరి విజయ్‌భాస్కర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఆ సంఘం కార్యాలయంలో రాష్ట్ర కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఉద్యోగులకిచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. ఆ పార్టీ అధికారంలో ఉన్న రాజస్థాన్, జార్కండ్ హిమాచల్ ప్రదేశ్ మొదలగు రాష్ట్రాల్లో సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు లింగమొల్ల దర్శణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఉప్పెరి విజయ్‌భాస్కర్, కోశాధికారి మారం లింగారెడ్డి, ఉపాధ్యక్షులు లెక్కల వీరేశం, మంగ నర్సింహులు, భూలక్ష్మి, జాయింట్ సెక్రటరీ నాగవెల్లి ఉపెందర్, అసోసియేట్ అధ్యక్షులుగా శిరందాసు రామదాసు, సందీప్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుపతి, శోభన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.